# "అదీ లేకపోతే."

కవికొండల వేంకటరావు

కొందఱివిషయంలో శరీరచ్ఛాయ అందఱివిషయంలోను నెత్తురుపారుదల భాగ్యవంతులకు బీదవాళ్లకు సరిసమానమేమో కాని తతిమ్మ అంగరంగవైభోగాలున్నాయే అవి ఎవరివి వారివే. ఆ తేడా పట్నవాసాల్లో మఱీ విస్పష్టంగా చెప్పచ్చు కొట్టిన ట్టగపిస్తుంది.

ఒక పెద్దభవనం ఏ నాలు గంతస్తుల్లో వుంటుంది — పై అంతస్తుమీద పూలతోట కూడా నెలకొల్పబడి — ఆ భవనంపక్కనో భవనానికి ఎట్టయెదుటనో ఒక గుడిసె నిట్రాటమీద తేలిపోతూ వుందా అన్నట్టు తాటాకు లెగిరి వెక్కిరిస్తూవుంటుంది. భవనం; గుడిసె నణచి వుంచే సూత్రప్రాయంగా, తననీడ బరువు అంతా ఆ గుడిసెమీదనే మోపి, ఆ గుడిసెలోకి గాలిగాని వెలుతురుగాని పోనీకుండా చేస్తుంది.

అయితే ఈ వ్యత్యాసం చాలా చోట్ల ఆయా ఇండ్లల్లో నివసించే మనుష్యుల్ని బట్టే వచ్చివుంటుం దనీ, కట్టడాల్లో లే దనీ, ప్రతిప్రతిపాదనకూ మినహాయింపు లుండక తప్ప దనీ, మనం అనుకునేటట్టు, ఓగులాబిరంగుగోడలమధ్య మేడయందు లేడీడాక్టరు వొకామె విద్యున్నగరంలో కాపురంవుంటూ, ఆ మేడపరిసరాల్లో వుండే పాటకజనంమీద జాలిచూపులు బఱపుతూ వారికి తనచేతనైనంతలో సర్వేసర్వత్ర ఉచితంగా వైద్యసాహాయ్యం చేస్తూ వుండేది. అజ్ఞానులకు ఆరోగ్యపంథా బోధిస్తూ వుండేది.

ఆమెపేరు కుముద్వతి. పేరు కుముద్వతి అని చెప్పి ముఖం చంద్రబింబంలా వుండక పోతుందా అని వూహించేరుకనక : ఆమె ముఖం కేవలం రాక్షసిబొగ్గు వర్ణం. నవ్వితే మాత్రం ఆమెచుట్టూ వెన్నెల. ఓవేళ చంద్రునిలోకూడా ప్రాధాన్యం వహించేది నలుపే అయి ఆనలుపు పొలుపుగా నవ్వడంలో పుట్టిందే తెలు పని వో నిశ్చితాభిప్రాయానికి రాగల్తుమా, ఈమె ముఖం కూడా చంద్రబింబమే! అయినా మన కీకథలో ఆమె సౌందర్యంతో నిమిత్తం ఎంతమాత్రం లేదు. కొందఱి మతంలోకూడా నలుపురంగు బహూ కలుపుకోలుతనం గొలిపే మంచిరంగే అని—. అలాంటప్పుడు అందునుగుఱించి పూర్వపక్ష సిద్ధాంతాలు చేస్తూ కాలయాపనం గావించుకునే కన్న, ఆమె కాశరీరచ్ఛాయ వుండడంవల్ల జరిగిన లోకోపకారం ఎట్టిదో కించిత్కథానకంగా వెంటనే తెలుసుకోవడమే ప్రశస్తం.

కుముద్వతి నివసించే మేడ కెదూరుగుండా రాజబాట కవతల "కిరోసీన్ డిపో" వొకటి వుంది. ఆ "డిపో" కాంపౌండు యొక్క లోపల్లంలో ఒక ప్రాకృతకుటుంబం వసియిస్తూ ఆ "డిపో" నంటిపెట్టుకు జీవిస్తూవుండడం కద్దు. కుటుంబం అని పెద్దది కాదు. ఒక ఇస్తోగు. మగడూ పెళ్లాం! వాళ్లు వాళ్లి

ద్దఱికే సర్రిపడా వోతాటాకు చుట్టుగుడిసె కుట్టు క్కాపరం వుండేవారు. వాళ్లకుటీరాన్ని అంటి, పక్కనే వొక నల్లతుమ్మమొలక పెరుగుతూ చూచేవాళ్ల కానవాలుగా కనిపిస్తుంది.

కుముద్వతి మొట్టమొదట్లో తనచూపులా నల్లతుమ్మమొలకమీదనే వాల్చింది. ఆదికారణం దానిచాయ తనచాయను వొకటిగా వుండడమే! మఱి వర్షాకాలం వచ్చేసరికి ఆ మొలక బెరడు నల్లన, పత్రం ఆకుపచ్చన, పువ్వు పసపువన్నె, యీలా మూడు రంగులు ముచ్చటగాచూపిస్తూ వానగాలికూగుతూవుంటే కుముద్వతి తనమేడమీదనుంచి కొన్ని యేండ్లుగా దాన్ని తన్మయంభావంతో తలపోసింది. రెండుమూడేండ్లు కడచన్నాక కమోసు, ఆ చెట్టు సరస నొకగుడిసె వుందని, ఆ గుడిసెలో పామరు లిరువురు దాంపత్యం కుదిరి నివాసంగా వుంటూ వున్నారని ఆమె తెలుసుకో కలిగింది. అప్పటికిసీ ఆమె వాళ్ల పేళ్లుగాని ఊళ్లుగాని పూర్తిగా కనుక్కోనే లేదు. ఊరికేనే ఆమె వాళ్లను చూడ్డాని కలవాటుపడింది.

వాళ్లిద్దరూ బసివీ బసవయ్యలు. బసివి భార్య: బసవయ్య భర్త. ఆశ్చర్యమెక్కడున్నదంటే వాళ్లిద్దఱూ శరీరంయొక్క అసితవర్ణంలో పరస్పరం వారిలో వారు తీసిపోకపోవడమే కాకుండా, కుముద్వతిరంగుకుగాని, నల్లతుమ్మ కుంచపుకైవారపు కొమ్మవన్నెగ్గాని ఏ మాత్రమూ తీసిపోరు. కాఱు నలుపువొడళ్లు వాళ్లిద్దఱి యొడళ్లూను.

వారియొక్క దైనిక జీవనవిధానం కూడా అర్థం చేసికోవడం మనవిధి. బసవయ్య గొడ్డలుచ్చుకు పుల్లలు పగలకొడతాడు. వాని గొడ్డలి బలువాయి, మహానిశితం. ఆ గొడ్డలిపిడి మామూలు గొడ్డళ్ల పిళ్లలాగు ఏ బిళ్లుకర్రతోనో తయారు కాబడింది కాదు. నల్లని రోకటితుండు తెచ్చి సాపు చేసి తరిమణిపట్టి దిగ్గొట్టిన గొడ్డలి అది. దాంతో అత డెప్పుడు పగలగొట్టినా ఉక్కులాంటి కాడిముక్క, ఇనుములాంటి తాటిదుంగ అనుకోండి. ఢణఢణ మ్రోగాలి. అతడు ఏ ప్రమానిమీద కాసియండి గొడ్డలి మోపి లేపి నరికాడా అంటే, మళ్లీ ఆ పరశురాముని డెందం ఉత్తివెన్న. ఎన్ని చెట్లు పడగొట్టివచ్చినా అతగాడు తనగొడ్డల్ని తనగుడిసెపొంత పెరుగుతూ వున్న తుమ్మమొలక మొదట సున్నితపు మూకీభావంతో చేరవేస్తూ "ఒలేవు అమ్మో! వేన్నీళ్లకుండ యిలా తే" అని అంటూవుంటే ఆమాట మహాప్రసన్నంగా వొక్క చేరువనున్న కుముద్వతి చెవుల్లోనే కాకుండా నేల నాలుగు చెఱగులా తియ్యగా వైర్‌లెస్ ఐ పాకిపోయింది. ఈ నా వ్రాతయందు ఎంత మాత్రమూ అతిశయోక్తి లేదు.

బసివి వెంటనే కిరోసీన్ డిపో కాంపౌండు ఆవలకు వెళ్లి ఆ ఆవల పొయ్యేట్టి కాచిన వేన్నీళ్లకుండ మోసుకొచ్చి మగనివద్ద పెట్టి, వానిరొంటిమీద వెచ్చవెచ్చగా నీళ్లుపోసి వాని వీపు తోముతూ వుంటే బసవయ్య అడిగేవాడు " ఇయేల ఎన్నిడ్రమ్ములు మోశావు?" అని—

అదీ వాళ్ల రోజువారి కుశలపృచ్ఛ!

***

బసివికి నెలదప్పింది. క్రమంగా నెలలు నిండినయి. తొమ్మిదినెలలూ పూర్తి అయి పదోనెలకూడా ఆక్రితంపున్నానికి చొరబడింది. ప్రస్తుత సాయంకాలం కూడా ఆమె కిరోసీన్ డ్రమ్ములూ డబ్బాలూ నాలుగో అయిదో ఎక్కడెక్కడి సంపన్నుల యిండ్లా దించి తన గుడిసెకొచ్చి తనమగనికి వేన్నీళ్లందిచ్చి తోముతూ వీపు మెచ్చింది. బసవయ్య వొళ్లు తుడుచుకుంటూ తన భార్యముఖం పూర్తిగా కనుగొలకుల్లోకి చూడకుండానే, బసివి గుడిసెలోంచి కూడట్టుకొచ్చి, లేలేతచుక్కల్ల వెలుగులో పెడుతూ అంది: "ఒరే! మాంవా! నాకీయేల బారగంపుగా వుంది" అని. బసవయ్య "అన్నింటికీ నారాయణమూర్తే వున్నాడు" అని దాకలో కూడుతిని ఆలా చిమ్మచీకటిలోనే ఎక్కడికో చక్కా పోయినాడు.

ఒక గంటవ్యవధిలో ఆప్రాంతం అంతా సద్దణగింద. దివ్వె లేదు, గువ్వ లేదు. గుడ్లగూబకూడా గూడే ప్రధానంఅని అనుకొన్నట్టు ఎక్కడనూ పైకివచ్చిన జాడలేదు. గబ్బిలాలు కూడా యేపక్క కెగిరిపోయినాయో గాని వాళ్లగుడిసె పక్కకు వెళ్లిన అజపజ కానరాదు.

***

ఏకాకిగా కిరోసీన్ డిపోకాంపౌండులో తన సొంతగుడిసెలో బసివి నొప్పులుపడుతూ వుంది. ఆకాశంమీాదను "స్వైరవిహారధీరమై" సాంద్రనీలమేఘశకల మొందు కొత్తగా ప్రయాణంసాగిస్తూ ఆగుడిసెమీాదనే ఆగడియకు నిలిచి అంధకారాన్ని నిబిడీకృతం గావిస్తూ విస్తరించుకు పోతూవుంది. దివ్వెలేదు, గువ్వ లేదు. గుడ్లగూబకూడా గూడేప్రధానం అని అనుకొన్నట్టు ఎక్కడనూ పైకి వచ్చిన జాడలేదు. గబ్బిలాలుకూడా యేపక్క కెగిరి పోయినాయో వాళ్లగుడిసెపక్కకు వెళ్లిన అజ పజ కానరాదు.

***

కుముద్వతి సహజంగా స్త్రీ అవడమే కాకుండా వైద్యురాలుకూడా అయి వుండడంచేత పెరవారి మూలుగుగాని మొఱగాని వినబడితే ఎంత నిద్రలో వున్నా ఏపుటపరిస్తూ వున్నా లేచి తెలిసికోవడం పరిపాటి.

తన మేడింటి గదిలో తాను కూర్చున్న సోఫాలోంచి లేచింది కుముద్వతి. "ఎవరా ఆ నొప్పులు పడేది?" అని వివేచన చేయ దొడగింది. బసివి అని నిర్ధారణకు వచ్చింది. ఆమె తన గదిలోని ఎలెక్ట్రిక్‌దీపం స్విచ్ వేసి కిటికీ తీసి, కిటికీలోంచి బసివియొక్క దళకుటీరంమీాదకు చూచింది. తనదీపపు వెలుక్కితా నడ్డుండకపోతే తిన్నగా వెలుగు వెళ్లి ఆకుటీరమ్మీాద పడ్డమే కాకుండా, కుటీరద్వారం గుండా కుటీరంలోనికంటా ప్రసరిస్తూ వుండడం కనిపెట్టింది. ఆ వెలు గాలాగే అట్టేపెట్టి, కిటికీతలు పాలాగే తీసివుంచి, కుముద్వతి స్వీయసింహద్వారంబయట తాళంవేసికొన్నదై నిర్గమించింది.

ఆమె తిన్నగా బసివివున్న చాయకు వెళ్లి ఆకుటింటివాకిట నిలబడి "బసివీ!" అంది. బసివి ఆక్రితందాకా చీకట్లోపడి ఏంసద్దుకు ఏంచికాకు పడిందో, తదితర ప్రపంచానికి అగోచరం. కాని కుముద్వతి తన మిద్దెమీాద లైట్ వేసికొన్న వెలుతురు గుడిసెలోకి జొరబారినప్పటినుంచీ, ఓ, గోగునార

నులకమంచం వాల్చుకు దానిమీద, కూర్చుండి పండీ, పండీ కూర్చుండి, బసివి నిసబు లేని ప్రసవవేదన పడుతూవుంది.

“అమ్మో” అని తన చనిపోయిన మాతృదేవతను స్మరించుకుంది. ఉత్తరక్షణమందే “భగవంతుడా ! శ్రీ మన్నారాయణమూర్తీ !” అని కేకవేసింది. ఒక్క నిమేషం పూరుకుంది. మళ్లీ “నాయనో ! ఈ బాధ భరించ లేనువోయి ! ఎవరల్లా ! అక్కడ?” అని ఎవరో చెంతనున్నట్టు అతిగా మతిలేని దానికిమల్లే దీనాలాపం గావించింది.

గుమ్మందరిసి కుముద్వతి రెండవతూరి “ బసివీ ! ” అని పిలిచి “ తోడెవరూ లేరు ? మంత్రసానినన్నా కబురెట్టుకున్నావు కావేం ?” అని సంబోధనతో వాక్యాన్ని మమైక్యంగావించి మిక్కిలి చనువుగా పలకరించింది.

ఆ పలకరింపు వినబడిందేమో బసివికి ప్రాణం లేచొచ్చిన ట్టయింది. కాని అప్పుడు ఎవరు పలకరించిందీ గుర్తింపు కానలేదు. అట్టే మంచంమీదమనిషి మంచంమీదనే ఉసులుకోసం లేస్తూ, పెండెనుంచి వేలాడుతూ వున్న ఒకానొక తాటినారయేచి నాసరాగా పట్టుకోవడాని కుద్యుక్తురాలైంది. ఉద్యుక్తురా లౌతూ వొక్కకూ కెట్టింది. “ఒరే ! మాంవా! నామాంవా! సమయాని కెక్కడికో పోయినావుగదరా ! చస్తూవున్నాను. నన్ను మళ్లీ ప్రజల్లో పడేశే దిక్కు లేదటోయి ! అబ్బా! అబ్బా ! పగవాళ్లకన్నా వద్దు యీ ఆరాటం ” అని కూకలోనే మూకై తనలో తనే శాంతించుకున్న మోస్తరుగా నిశ్శబ్దస్థాయికి వచ్చింది. మంచం మీద ఎదో వీలుగా తొంగుడుంది.

ఆకాశమ్మీద మేఘం డబాడబా ఉఱమడం ప్రారంభించింది. డబడబా ఉఱిమిందంటే, ఉఱుముకు ముందు మెఱసిన మెఱపుల్ని వేఱే ఉటంకించ నవసరం లేదుగా ! ఏ మెఱపున కే యుఱుమో బోధపడనంతటి ప్రబోధ గావిస్తూ ఏతన్నిశీథినీవాతావరణం చినుకువినా మేఘాల్తో అలుముకుపోయింది. “ఈ కనబడే కాదంబినియొక్క సూదిమొన, ఆ కనబడే కాదంబినియొక్క దిమ్మాకారంలోని కెలా చొర్చుకు మాలామాలా సమతలవలయమై నున్నని నల్లగచ్చుమాదిరిగా ఆవరించుకున్నాదో ఆకాశాన్నంతనూ ! ” అన్న ఆశ్చర్యమే నిద్రపట్టని ప్రతీప్రాణికీ ఆరాత్రి !

అర్థం కానిదైనా, అధ్వాన్న మైనా, ఆర్ద్రంగా వున్నదనో ఏమో అవకాశంకేసి చూసుకుంటూ బసవయ్య ఆచీకువేళ ఈలేసుకుంటూ కిరోసీన్ డిపో గేటుగుమ్మం దాటి తన గుడిసె చెంతకు వచ్చేడు;...

“సూరప్ప సీకోక చుక్కల్లకోక”

అని ఎదో ఎక్కడ పట్టుబడిందో వో గాలిపాట విసిరేడు.

కుముద్వతి వాని రాగాలాపం వానిగొంతూ ఆలకిస్తూ, మానవజీవితరహస్యాన్ని గుఱించి దీర్ఘంగా పర్యాలోచించసాగింది. “అరే! వీనిభార్య పడరాని నొప్పులు భరిస్తూవుంది. వీడు ఎక్కడికో పోయి, తన కూడా మంత్రసానినన్నా వెంటబెట్టుకు రాకుండా వొక్కడూ తిరిగి వచ్చినాడే! వీనినట్టింట దీపంగాని దివటీగాని లేదు.

ఏతట్టు చూచినా కుహరవే కూపవే! ఇసీ! ఏమి వీని కీపాట! ఏమి వీని కీ నిశ్చింత!" అని అత్యంతం విస్తుపోయింది. లోలో మధ్య మధ్య తనలో పొడముతూవున్న జడిమ నుడుపుకోవడంకోసంగాను కుముద్వతి అలా తన రెండుచేతులూ విదలించుకుంది. ఆవిదలింపులో ఆత్మీయములైన ఆభరణాలు రెండు కంకణాలు మూడు గాజులూ చప్పుడు కాగా (రాత్రిపూట ఆమె కంకణాలూ గాజులూ పెట్టుకుంటుంది. పగలు సర్వసాధారణంగా ధరించదు రోగుల కుపచారం మిక్కిలిగా చేయవలసి వుండి) చప్పున ఆచప్పుడణచి ఆనగ లూడ్చి తన చెంగున ముడివైచుకుంది.— ముడివైచుకుంటూ "ఎవరు నువ్వు?" అంది బసవయ్యను అదలించేలాగ.

బసవయ్య ఆప్రశ్నకు చకితుడైనాడు. కంఠధ్వని ఆకళింపుకు దెచ్చుకున్నాడు. కనిపించకపోయినా "అమ్మగారూ! తంవరా? దణ్ణాలు. సీకట్లో యిలా వచ్చారేంటి?" అన్నాడు. కుముద్వతి వెంటనే "ఓరిపలుగూ! కష్టపడుతూవున్న పెళ్లాన్ని విడిచిపెట్టి ఆలా పోవచ్చురా! అదిగో ఆఆడుకూతు రీవఅకూ వెలిబుచ్చిన కూయి ఇంకా దిగంతపు దిగువాయిని ప్రతిధ్వనిస్తూనే వుంది. విను విను. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుతాలి కట్టిన దాన్ని కనిపెట్టి చూడు. దీపం వెలిగించు" అంది విశాలనయనాల తనదృష్టి నిగిడ్చి.

బసివి కించి త్తెప్పిరిల్లినదానిలా, పై సంభాషణ పోల్చి అనుసంధించుకున్నదానిలా, చేయి విసిరింది తననిషేధసంజ్ఞ చీకట్లో కనబడక పోయినా, "అక్కర్లేదండమ్మా! వాణ్ణేం అనకండమ్మా! బిడ్డ ఢుట్టినట్టున్నాడు" అని అంది.

కుముద్వతి గుండెలు దడదడ కొట్టుమిట్టాడినయి ఆనుడి వినడంతోనే. "పిల్లడేడవడం లేదు. చచ్చి పుట్టివుంటాడుకూడాను. ఓరి మొద్దూ! ఓరి మొఅకూ! నీవు మగవాడవు కావురా! దీపం వెలిగించు. అగ్గిపుల్ల గీయి! వేడెక్కించాలి బిడ్డకు" అంది కుముద్వతి.

బసవయ్య చేతులు నులుపుకుంటూ "తల్లీ! యీ కిరోసీన్ డిపో కాంపౌండులో మేం కాపరం వుండీది, మేం పాటుపడీది అగ్గిపుల్ల వెలిగించుకోనిపద్ధతి కొడిగట్టే! నిప్పు చేసికోని పరతుకు లోబడే! దీపం పెట్టుకోని పాపాని కొడబడే తల్లీ! తల్లీ! రక్షించు! రక్షించు నిన్ను భగవంతు డిలా చూపించాడు మా కీర్త్రి దేవుడులా!" అని అన్నాడు నుడికారం పొడిగిస్తూ, పొడిగింపులో బేలతనం వెలిబుచ్చుతూ, వెలిబుచ్చడంలో కాలంయొక్క విలువ తెలీక ఏమరిల్తూ.

కుముద్వతి కా తరుణమందు వాని మనివీ మన్ననా కావాలీ? ఆమె వానిని వినీవిననిదానిలా గ్గమనిస్తూ "యీలోకంలో బ్రహ్మ మీ యిరువురి దంపతుల్ని జ్ఞాన మార్జించుకోని పద్ధతిని అవతరింపజేశాడు అను! కిరోసీన్ డిపో యజమానిమీద నెపం మోపుతా వెందుకు? అగ్గిపుల్ల గీయరాని పద్ధతి నంటా వెందుకు? ఆలారా! ఆమంచం యీ వెలుగులోకి పట్టు!" అని పిల్లాతల్లీ వున్నమంచం తానూ బసవయ్యతోపాటు సాయంపట్టి, మెల్లిగా దించింది,— తన కిటికీగుండా వచ్చి పడుతూవున్న విద్యుద్దీపకాంతి బిడ్డని నాభీకమలంమీద పడేటట్టు: స్వకీయ సహజకవోష్ణరక్తరాగాంకితము లైన మెత్తని అరచేతు లా శిశువుమీద ఆంచింది. కుము

ద్వతి నిసువును నిమిరింది. బొడ్డుకాడ రాచి తల్లినెత్తురు పిల్లలోనికి ధారాళంగా ప్రవహింపుగొనేటట్టు పొడుగుతా గీచి కొంత పరిశ్రమ గావించింది. పై ఆకాశం ఆమెకు తోడ్పాటవుతూ, కంచు అరివేణం మ్రోగింపులా, పిత్తళిపళ్లెం వాయింపులా ఉఱిమింది. బిడ్డడు ముజ్జగాలకూ బ్రహ్మానందం గలిగేటట్టు కేర్ మన్నాడు. ఆగలే. కేర్ కేర్ మన్నాడు. పట్టరాని ఏడు పేడ్చాడు.

"బసవయ్యా" నీవు అదృష్టవంతుడివోయి!" అని కుముద్వతి తాను తన మొలనెప్పుడూ తాళంచెవుల్తో పాటు వుంచుకునే శస్త్రచికిత్స సంబంధమైన పరిశుద్ధపు ఛురిక తీసి, బొడ్డుకోసి, తగు దారాలతో ముడివేసి "సీసీళ్లూ నిప్పులూ నీవు చూచుకో ఇంక" అని తెలతెలవారుతూ వుంటే వచ్చి తన యింట విశ్రాంతి పొందింది.

***

ఏడెనిమిది నెలలైనతరువాతి సంగతి యీాపైని విలిఖించేది. నగరంలో ఒక ఉపన్యాసకురాలు స్త్రీజనానికి అతిగంభీరంగా వుపన్యసిస్తూ వుంది. ఆసభకు బీదాసాదా అన్నిరకాల ఆడవాళ్లూకూడా వచ్చి కూర్చున్నారు. లేడీడాక్టర్ కుముద్వతి అధ్యక్షత వహించింది — బసివి నానాటికీ పూర్వంకన్న లోకజ్ఞానం అంతో ఇంతో శ్రుతపర్చుకుంది. కాని పేదరాలు కావడంచే మాట చాకచక్యమే చూపించగలిగేది కాని కట్టుపెట్టుల్లో ఎప్పటి చొప్పు ఉప్పు లేని ముప్పొద్దు బతుకే.

బసివి కక్కలిగిన కుఱ్ఱ డేడెనిమిదినెల్లవాడైనాడు. ముద్దుగా బొద్దుగా పెరిగి చాయలో తల్లిగ్గాని తండ్రిగ్గాని బిరుదియ్యావన్నట్టు పాకుతూ డేకుతూ కనబడేవాడు.

ఆ బిడ్డడికి మెళ్లో ఆకాశనీలపువ్వులపేరొకటి వేసి ఆబిడ్డ న్నెత్తుకు బసివికూడా ఆసభకు వచ్చి సభామధ్యమందు కూర్చుని ఉపన్యాసకురాలు చెప్పేముక్కలు నాలుగూ చెవిని పడేసుకుంటూవుంది.

ఉపన్యాసకురాలు చివర మఱచిపోరాని ముఖ్యాంశంగా యీా వాక్యం చెప్పింది. ఇంకా పూర్తిగా చెప్పలే. "మీారు వెలుగుకోరనిపద్ధతిలో జీవించేటప్పుడు (అనగా ఆమె అభిప్రాయం వెలుగు అంటే విజ్ఞానం అని) మీారు మనుష్యజాతి సంఖ్య పెరగనివ్వరాదు. మీాకు పిల్లలు పుట్టేపని మీారు మీామీా మగలచేత ఎంతమాత్రం చేయించుకోకూడదు; అనగా ఏమి? మనకు సంభోగప్రక్రియ నసిపడదనాలి!" అని ఖచ్చితంగా ఝూంకరించి చెబుతూ వుంది.

అట్టి రసకందాయపట్టులో బసివి తన పిల్లడి సమేతంగా పైకి లేచిందై "ఓ ఉపన్యాసమ్మగారూ! అదీ లేకపోతే మేం చచ్చిపోతాం తల్లీ ఈ అంధకారబంధురంలో పడి. తల్లీ! మాకు భాగ్యభోగ్యాలు లేనేలేవు. అదైనా వుంచండి" అని నమస్కారం చేసింది. ఉపన్యాసకురాలు గుడ్లెఱ్ఱచేస్తూ "అదంటే?" అంది. బసివి "మగవాని ప్రేమ! మగవాని పరీమళం! మగవానిఅండ!" అంది.

సభంతా నవ్వుతూ కరతాళధ్వనులు గావించి లేచారు. బసివి చంకనున్న బుడుతడుకూడా తన చిట్టిచేతులు తట్టుకోబోయినాడు కాని వాని చేతులకు వాని మెడలోని పూసలదండ అడ్డొచ్చింది. అయినా వాని కరతాళధ్వనికి ప్రత్యామ్నాయంగా వాని మీాది మహదాకాశం సరళంగా ఉఱిమింది;

అందఱూ పైకి చూచేరు. ఆసభమీద ఒకానొక చల్లని మొయిలు నిరంతరయానం గావిస్తూ కుముద్వతిమీద అమృతపు చినుకు కురిసింది.

కుముద్వతి బసివితో "నాటికి నేడు విన్నాను మళ్ళీ నీ గొంతు బసివీ!" అంది. బసివి "అవునంటూరా! కాదంటూరా! అగ్గిపుల్లా లేక అదీ లేకపోతే చచ్చిపోమండీ మేం. సొప్పండీ!" అంటూ వెకిలి నవ్వులు నవ్వుకుంటూ, బిడ్డని పెదవుఁకు తన చేపొచ్చిన పాలిం డ్లందిచ్చుకొంటూ "సెలవు తల్లీ"! అని వెళ్ళిపోయింది.

బసివిబిడ్డడు తనను వెనుదిరిగి చూస్తూవుంటే కుముద్వతి అభినందనపూర్వకంగా "రా! రా" అంది. కాని వస్తాడా? కావాలంటే కలుగుతారా బిడ్డలు?

---

వేలకొలది
కుష్టు, బొల్లి, సుఖ వ్యాధులు కుదిర్చిన దెవరు?
బి. రెడ్డి. అండ్ కో
రిజిష్టర్డు
గోపాలపురం. తూర్పు గోదావరి
(via) తణుకు M.S.M.RY
REGD.
ప్రొప్రయిటరు. జి. వి. రెడ్డి

భాస్కరానంద యోగిపుంగవునిచే
ప్రసాదింపబడి
60 వేల రోగులకు పైగా ఆరోగ్యమిచ్చిన ఆదిసంస్థ.
"అసలు కంపెనీ ఏదో తెలుకోండి"
డాంభిక ప్రకటనలకు, నకలుమందులకు మోసపోక
మాతో సలహాచేయండి.

స్త్రీసుధ
స్త్రీల సమస్త గర్భాశయవ్యాధులకు.
మైల సరిగ కాకుండుట, ఋతుశూల,
తెలుపుబట్ట, మైల అధికముగ అగుట
మొదలగువానికి దివ్యామృతము. 1 నెలకు 1 తులం రు 3/-

బాలసుధ
రిజిష్టర్డు
బాలుర సమస్త వ్యాధులకు.
అజీర్ణము, జలుబు, దగ్గు, జ్వరము, విరేచననగ
అనేకవర్ణములుగఅగుట, విరేచనమువాసము
అగుట, పోతపాలవలన కలుగు జబ్బులు
మొదలగువానికి. 1 నెలకు 50 మాత్రల సీసా రు 1/-
డాక్టరు శ్రీపాద కృష్ణమూర్తి, బెజవాడ.